క్లుప్తంగా

స్పందించిన అధికారులు



కొత్తపల్లి: మండల కేంద్రంలో నెలకొన్న తాగు నీటి సమస్యపై ఇటీవల తిమ్మారెడ్డి పల్లి గ్రామాన్ని సందర్శించిన కొడంగల్ నియోజకవర్గ ప్రత్యేక అధికారికి గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో స్పందించారు. గ్రామ మాజీ ఎంపీటీసీ, పంచాయతీ కార్యదర్శి, ,గ్రామ పెద్దలతో చర్చించి తాగునీటి బోర్ల మరమ్మతుకు చర్యలు తీసుకున్నారు. ఈ బోరు నుంచి చౌరస్తా పరిసర ప్రాంతాల ప్రజలకు పాత పైప్‌లైన్ ద్వారా తాగునీటిని పునరుద్ధరించారు. దీంతో గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

మహాసభకు తరలిన పద్మశాలీలు



ధన్వాడ: హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగిన 17వ అఖిల భారత పద్మశాలి మహాసభ, 8వ తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహాసభకు ధన్వాడ మండల కేంద్రం నుంచి పద్మశాలీలు ఆదివారం తరలి వెళ్లారు. చేనేత రుణాలు మాఫీ, చేనేత కార్మికులకు రూ.5వేల పెన్షన్, ప్రతి చేనేతకు జియో ట్యాగింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నారాయణపేట ఎడ్యుకేషన్: పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో 2000–21 సంవత్సరం పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలి

ధన్వాడ: నారాయణపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డికి శాసనసభ్యుల కోట నుంచి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని బీఆర్‌ఎస్ పార్టీ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి నర్సింహులు కోరారు. ఎస్.రాజేందర్‌రెడ్డి రెండు సార్లు ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారని, ఆయనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు

స్వర్ణోత్సవ సభలో పుస్తకావిష్కరణ



వనపర్తి విద్యావిభాగం: తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ ధర్మ పీఠం స్వర్ణోత్సవం సభలో వనపర్తి పట్టణానికి చెందిన డాక్టర్ బైరోజు శ్యాం సుందర్ పరిశోధనా గ్రంథాన్ని మాజీ శాసనసభ సభాపతి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి ఆవిష్కరించారు. ఆదివారం హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో విశ్వబ్రాహ్మణ ధర్మ పీఠం ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ సభలు నిర్వహించారు. ఈనాటి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై 2015 సంవత్సరంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టాను పొందిన డాక్టర్ శ్యాంసుందర్ సిద్ధాంత గ్రంథాన్ని ఆవిష్కరించారు. విశ్వకర్మ సంస్కృతి సాంప్రదాయానికి సంబంధించి సాహిత్యం ఎంతో ఉందని, దానిపై మరిన్ని పరిశోధనలు జరగాలని మధుసూదనాచారి సాహితీవేత్తలను కోరారు. ఈనాటి కార్యక్రమంలో సభాపతి డా.త్రిమూర్తుల గౌరీశంకర్, లాలుకోట వెంకటాచారి, దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు డాక్టర్ శ్యాం సుందర్‌ను శాలువా పూలమాల జ్ఞాపికతో సత్కరించారు. ఈ మేరకు వనపర్తి జిల్లా సాహితీ కళా వేదిక అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్, ప్రతినిధులు జనజ్వాల, బండారు శ్రీనివాస్, నరేష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

బ్రిడ్జి నిర్మాణానికి మోక్షమెప్పుడో?

- వల్లభాపురం–కుర్మగడ్డకు రాకపోకలకు ఇబ్బంది
- మహారాష్ట్ర నుంచి భక్తుల రాక
- పుట్టీలో వెళ్తేనే దత్తాత్రేయ దర్శనం
- పుట్టి మునిగితే అంతే సంగతులు
- బ్రిడ్జి నిర్మిస్తేనే భక్తులకు సౌకర్యం



వల్లభాపురం - కుర్మగడ్డ మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానది (ఫైల్)

మక్తల్: మక్తల్ మండలం పస్పుల గ్రామం దగ్గర వల్లభాపురంలో దత్తక్షేత్రం ఉంది. అక్కడ ప్రతినిత్యం దత్త భక్తులు దర్శనం కోసం అధికంగా వస్తుంటారు. తెలంగాణ ప్రాంతం నుంచి కర్ణాటకకు అవతల గడ్డకు వెళ్లాలంటే పుట్టిలో ప్రయాణం చేయాల్సిందే. దత్తాత్రేయ స్వామి తపస్సు చేసిన స్థలం కావడంతో భక్తులు అక్కడికి రావడానికి మొగ్గుచూపుతారు. పుట్టీల్లో ప్రయాణానికి ఒక్కొక్కరికి రూ. 50 చార్జి తీసుకుంటున్నారు. ఇవతల నుంచి ఒక పుట్టి వస్తే కర్ణాటక నుంచి మరొక పుట్టి వెళ్తుంది. ఇక్కడ కొన్ని కుటుంబాలు పుట్టి ప్రయాణంతోనే జీవనం గడుపుతున్నాయి. వల్లభాపురం దేవాలయం నుంచి కృష్ణానదిలో పుట్టి ద్వారా ప్రయాణం చేసి దర్శనం చేసుకుంటారు. కృష్ణానదిలో బ్రిడ్జి నిర్మాణం చేస్తే భక్తులకు సౌకర్యంగా ఉంటుంది. పుట్టి ప్రయాణం వల్ల ఏ క్షణంలో ఏమి జరుగుతుందోనని భక్తులు భయాందోళనకు గురవుతున్నారు. కొన్ని సంవత్సరాల క్రితం పుట్టి మునిగి రెండు కుటుంబాలు నదిలో మునిగి కొట్టుకుపోయి మృతి చెందారు. భక్తుల కోసం బ్రిడ్జి నిర్మించాలని సీఎంలకు, మంత్రులకు, కలెక్టర్లకు, కర్ణాటక ప్రభుత్వానికి ఎన్నో సార్లు విన్నవించినా ఫలితం లేదు. ఏళ్ల గడుస్తున్నా బ్రిడ్జి నిర్మాణానికి నోచుకోవడం లేదు.



పస్పుల ఘాట్ నుంచి వల్లభాపురం - కుర్మగడ్డకు బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రదేశం

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి



పస్పుల గ్రామం దగ్గర కుర్మగడ్డ దత్తాత్రేయ దేవాలయం వరకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి. దత్తాత్రేయస్వామి దర్శనం కోసం ప్రతిరోజు భక్తులు వస్తున్నారు. కర్ణాటక ప్రాంతం నుంచి భక్తులు వస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణం చేపడితే భక్తులకు సౌకర్యంగా ఉంటుంది. లేదంటే పుట్టీల్లో ప్రయాణం చేయాల్సిందే. కొన్ని సంవత్సరాల క్రితం పుట్టి మునిగి రెండు కుటుంబాలు నదిలో మునిగి చనిపోయారు.

– దత్తు, పస్పుల దత్తక్షేత్రం ఆలయ కమిటీ చైర్మన్

రెండు రాష్ట్రాల సీఎంలు దృష్టి పెట్టాలి



దత్తాత్రేయ దర్శనం కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం బ్రిడ్జి నిర్మాణం కోసం తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల సీఎంలు ప్రత్యేక దృష్టి పెట్టాలి. పస్పుల దగ్గర ఉన్న దత్తాత్రేయ దేవాలయం నుంచి కుర్మగడ్డకు బ్రిడ్జి ఏర్పాటు చేయాలి. కర్ణాటక, తెలంగాణల్లో ఒకే పార్టీ అధికారంలో ఉండడంతో సమస్య తీరుతుందని కోరుతున్నాం. సీఎంలు కృష్ణానది దగ్గరకు వచ్చి పరిశీలించి బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలి.

– నాగేష్, పస్పుల

అవగాహనతోనే ఆరోగ్యం

- ఇష్టారీతిన పురుగుల మందుల పిచికారీ
- అనారోగ్యం బారిన రైతులు
- వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి

కోస్గి: ఎంతో కష్టపడి వేసిన పంటలను చీడపీడల నుంచి కాపాడుకునేందుకు రైతులు రకరకాల పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. ఈ విషయంలో కనీస జాగ్రత్తలు పాటించకపోవడంతో ప్రతియేటా రైతులు అనారోగ్యం బారిన పడటమే కాకుండా, విషం బారిన పడి మృతి చెందిన సంఘటనలు సైతం చోటు చేసుకుంటున్నాయి. పంటలకు సైతం కొత్తకొత్త రోగాలు వస్తుండటంతో మార్కెట్‌లో గాఢత ఎక్కువ ఉన్న పురుగుల మందుల్ని విచ్చల విడిగా అమ్ముతున్నారు. రైతులు పంటలకు ఏవైనా చీడపీడలు ఆశించినట్లు గుర్తిస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించి సరియైన మందులు, వారి సలహాలు, సూచనలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. రైతులు ఎవరూ అధికారులను సంప్రదించకుండానే వ్యాపారులను నేరుగా కలవడంతో ఇష్టారీతిగా మందులు అంటగడుతున్నారు. మందులు తీసుకునేటప్పుడు అధికారులను సంప్రదించాలని, మందుల పిచికారీ విషయంలో అనారోగ్యం బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్ సూచిస్తున్నారు. పురుగుల మందు పిచికారీ సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలను డీఏఓ వివరించారు.

మందుల పిచికారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- గాలికి ఎదురుగా పురుగు మందు పిచికారీ చేయరాదు. ఇలా చేయడం వల్ల పురుగుల మందు శరీరంపై పడుతుంది.
- పిచికారీ సమయంలో చేతులకు తొడుగులు, ముఖానికి మాస్కు తప్పకుండా ధరించాలి.
- పిచికారీ సమయంలో మధ్యలో నీరు, ఆహార పదార్థాలు తీసుకోరాదు.
- పని పూర్తయిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి.
- పిచికారీ సమయంలో శరీరాన్ని మొత్తం కప్పి ఉంచే విధంగా ప్రత్యేక దుస్తులు వాడుతూ కళ్లజోడు సైతం వాడాలి.
- వాడిన డబ్బాలను ఎట్టి పరిస్థితిలో పశువుల పాకలో భద్రపరచరాదు.
- మందుల వాసనతో పశువులు సైతం అనారోగ్యానికి గురై మృతి చెందే ప్రమాదం ఉంది.
- వాడిన పురుగు మందు డబ్బాలనుగాని, ప్యాకెట్లను గాని భూమిలో పాతిపెట్టాలి.
- మందుల్ని పిచికారీ చేసిన తర్వాత రైతుకు వాంతులైన, చెమటలు పట్టిన, ఆయాసానికి గురైన వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.



బత్తాయితోటలో మందు పిచికారీ చేస్తున్న రైతు

ఓపెన్ విద్యపై అవగాహన పెంచాలి



ఓపెన్ తరగతులను పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ శివయ్య

మరికల్: మధ్యలో చదువుకు దూరమైన వారిని ఓపెన్ స్కూల్‌లో చేర్పించడం కోసం మరింత అవగాహన పెంచాలని ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ శివయ్య అన్నారు. మరికల్‌లో ఆదివారం ఓపెన్ తరగతులను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠ్యాంశాలు విద్యార్థులకు అర్థమయ్యేలా ఉండాలని సూచించారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. ప్రతి సంవత్సరం అధిక సంఖ్యలో ఓపెన్ స్కూల్, కళాశాలలో అడ్మిషన్లు పొందేలా కోఆర్డినేటర్లు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ సెంటర్ కోఆర్డినేటర్ చెన్నారెడ్డి,, జ్యోతి, జగన్ పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి



మాట్లాడుతున్న వెంకట్‌రాంరెడ్డి

మక్తల్: మహిళలపై జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి అన్నారు. ఆదివారం మక్తల్‌లో మహిళల శ్రామిక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలపై దాడులు, లైంగిక వేధింపులు, హత్యలు జరుగుతున్నాయని, వాటిని వెంటనే అర్టికట్టాలన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గోవిందురాజు, అమీనాబేగం, సుజాత, పార్వతమ్మ, గోవిందమ్మ, వెంకటమ్మ, యశోద, ఇందిరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన నీటి సరఫరా



మరమ్మతుకు నోచుకోని అశోక్‌నగర్ బోరు

మరికల్: మండల కేంద్రంలో తాగునీటి బోర్లకు మరమ్మతు చేస్తుండడంతో పది రోజుల నుంచి మరికల్‌లో నీటి సమస్య కొనసాగుతోంది. మూడు రోజుల నుంచి మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతుల కారణంగా నీటి ఎద్దడి త్రీవరూపం దాల్చింది. అశోక్‌నగర్‌లో పశువైద్యశాల దగర ఉన్న బోరు, గౌడుగోని వంపు దగర బోరు మరమ్మతులకు రావడంతో గ్రామస్తులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు భగీరథ నీళ్లు కూడా మూడు రోజుల నుంచి సరఫరా కాకపోవడంతో నీటి వనరులున్నా, బోర్ల దగ్గర నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నారు. అధికారులు స్పందించి వెంటనే తాగునీటి బోర్లను మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై కార్యదర్శి శ్యామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ మోటార్లను మరమ్మతు చేయిస్తున్నాం. రెండు రోజుల్లో నీటి సరఫరా చేస్తామన్నారు.

మరమ్మతుకు నోచుకోని శుద్ధజల కేంద్రాలు



మండలంలో మూతపడ్డ శుద్ధజల కేంద్రం

నర్వ: మండలంలోని ఆయా గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన శుద్ధజల కేంద్రాలు మరమ్మతుకు నోచుకోక మూతపడ్డాయి. మండలంలోని నర్వ, యాంకి, రాయికోడ్, కొత్తపల్లి, లంకాల్, గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాల్లో పంచాయతీ నిధులు, గ్రామస్తుల వాటాతో గతంలో ఈ కేంద్రాలను నిర్మాణం చేపట్టారు. ఈ కేంద్రాలు నిర్వాహణ సరిగ్గా లేక, నిధుల లేమీతో కొన్ని రోజులకే పరిమితమయ్యాయి. కొన్ని రోజులుగా గ్రామాలకు సరఫరా అవుతున్న మిషన్‌భగీరథ తాగునీరు ఇటీవల తరచుగా పైప్‌లైన్ పగుళ్లు, మోటార్లు మరమ్మతులకు గురవుతుండడంతో తాగునీటికి ఇబ్బందులు ఏర్పాడుతున్నాయి. గ్రామాల్లోని తాగునీటి సోర్సు బోర్ల నుంచి సరఫరా అయ్యే ఉప్పునీటిని తాగలేక ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాగునీటి శుద్ధజల కేంద్రాలను మరమ్మతు చేయిస్తే శుద్ధజలాలకు ఎలాంటి ఇబ్బందులుండవని వారు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?



మూలమలుపులో ప్రమాదకరంగా మారిన రోడ్డు

మాగనూర్: గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా, అధికారుల అలసత్వం వల్ల అవి ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. ఇందులో భాగంగా మండలంలోని వాడ్వట్ నుంచి మందిపల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో మూలమలుపుల్లో వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా అధికారుల్లో ఏమాత్రం చలనం లేదు. ఈ దారిలో కనీసం సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ మధ్య జరిగిన ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. గ్రామీణ ప్రాంతంలో రైతులకు అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడంతో ఎక్కడబడితే అక్కడ రోడ్డును తవ్వేస్తున్నారు. దీంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. రైతులకు సరైన అవగాహన కల్పించాలని వాహనదారులు కోరుతున్నారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి

ఆత్మకూర్: సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి పట్టణ ప్రజలు సహకరించాలని కమిషనర్ శశిధర్ అన్నారు. ఆదివారం సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి పన్నులు వసూలు చేశారు. ఈ ఏడాది పన్నుల లక్ష్యం రూ.2.23 కోట్లకు గాను ఇప్పటి వరకు రూ.1.13 కోట్లు వసూలు కాగా సూమారు రూ.1.10 కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు. పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని, వేసవి సందర్భంగా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అధ్వానంగా లక్కర్‌దొడ్డి రహదారి



గోతులతో అధ్వానంగా ఉన్న నర్వ - లక్కర్‌దొడ్డి రహదారి

నర్వ: మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న లక్కర్‌దొడ్డి గ్రామానికి ఉన్న రహదారి పూర్తిగా దెబ్బతిని అధ్వానంగా మారిందని గ్రామస్తులు పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా తట్టెడు మట్టి వేసే దిక్కులేకుండా రహదారి గతుకులమయంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బీటీ రహదారి కల అందనంత దూరాన ఉందని, ఈ రహదారి గుండా కొత్తపల్లి గ్రామానికి వెళ్లేందుకు బీటీ రహదారి ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైందన్నారు. పాలకులు మారుతున్నారు తప్పా రహదారులు మారడం లేదని పేర్కొన్నారు. నిత్యం విద్యార్థులు, గ్రామ ప్రజలు నర్వకు రావాల్సిన నేపథ్యంలో ఈ అధ్వానపు రహదారిపై ప్రయాణం ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ రహదారిని శాశ్వతంగా బీటీ రహదారిగా మార్చేందుకు నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చారిత్రక కట్టడాలు పదిలమేనా?



నర్వలో శిథిలమైన అలనాటి గ్రామ ముఖ ద్వారం

నర్వ: కాకతీయుల కాలం నాటి కట్టడాలు అనేకం మండలంలోని ఆయా గ్రామాల్లో శిథిలమై నేటికీ దర్శనమిస్తున్నాయి. ఈ కట్టడాలు అనేకం రాతిగోడలు, మట్టి గోడలు పగుళ్లు ఏర్పడి కూలేందుకు సిద్ధంగా ఉండి ప్రమాదకరంగా మారాయి. గతంలో దాతలు, ఆయా గ్రామస్తులు చేయూతనందించి వీటిని మరమ్మతు చేసుకోవడంతో కొన్ని నేటికీ ఆనాటి చారిత్రక నేపథ్యానికి సాక్షాలుగా మారాయి. మరి కొన్ని గ్రామాల్లో ఎన్నో ఏళ్ల చారిత్రక కట్టడాలకు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో శిథిలమై రోజు రోజుకు కూలేలా ప్రమాదకరంగా మారాయి. వాటిని చరిత్ర పరిశోధకులు, పురావస్తు శాస్త్రవేత్తలు పరిశోధన చేసి నాటి కట్టడాలను కనీసం మరమ్మతు చేపడితే మరికొన్ని రోజుల పాటు భవిష్యత్ తరాలకు సాక్ష్యాలుగా ఉంటాయని చరిత్ర ప్రేమికులు కోరుతున్నారు.

విరక్తమఠం మహోత్సవాలు

- ఈ నెల 7న మొదలైన ప్రవచనాలు
- 16 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- 17న రథోత్సవం, 18న జాతర



శ్రీ సిద్ధలింగేశ్వర మఠం



శ్రీసిద్ధలింగస్వామి ఆలయ సముదాయం



శ్రీసిద్ధలింగమహాస్వామి మూలవిరాటు

మాగనూర్: శ్రీ పశ్చిమాద్రి సంస్థాన విరక్తమఠం నెరడగం సంస్థాన బ్రహ్మోత్సవాలు ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభమైన మార్చి 18 వరకు కొనసాగుతాయి. నైజాం కాలం నుంచి ఇప్పటి వరకు ఈ మఠం ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉంది. ఇక్కడికి వచ్చిన భక్తుల కోర్కెలు, బాధలు, జబ్బుల నుంచి విముక్తి లభిస్తుందని భక్తుల విశ్వాసం.

- నైజాం కాలంలో ప్రస్తుత మాగనూర్ మండలంలోని నెరడగంలో మొదటి సిద్ధలింగస్వామి అనే సాధువు శ్రీశైలం నుంచి వచ్చి ఇక్కడ గ్రామ సమీపంలో తోటలో కూర్చొని కొన్ని సంవత్సరాలు తపస్సు చేసేవాడు. అప్పటి నైజాం కాలంలోని మహిబూబ్‌అలీ సంస్థనానికి భటుల ద్వారా పిలిపించి స్వామి మహిమలను పరీక్షిస్తాడు. గుర్రం కడుపులో అడ గుర్రం ఉందని బయటకి తీసి చూపెడతాడు స్వామి. స్వామి మహిమలు తెలుసుకున్న నిజాం ప్రభువు మాంసపు విందుకు ఆహ్వానిస్తాడు. స్వామి తమ మహిమలతో మాంసపు విందును పండ్లుగా మార్చి భుజిస్తాడు. దీంతో మహిబూబ్‌లీ మక్తల్ నుంచి బిదార్ జిల్లా వరకు 12 వేల ఎకరాల భూములు స్వామికి కేటాయించాడు. అప్పటి నుంచి నేటి వరకు సహాయం కోరి వచ్చిన వారికి లేదనకుండా సహాయం చేస్తున్నారు. ప్రస్తుతం 5వ పిఠాధిపతి సంస్థనంను కొనసాగిస్తున్నారు.

కార్యకమాలు ఇలా..

- 15న ఉదయం 9గంటలకు నూతన శ్రీ సుకుమార గోశాల ప్రారంభోత్సవం, ఉచిత వైద్య శిబిరం, 10 గంటలకు రక్తదాన శిబిరం, సాయంత్రం విద్యార్థులతో తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమం ఉంటుంది.
- 16న ఉదయం 9 గంటలకు అభివృద్ధి పొందిన గురుమఠం లోకార్పణం, 10 గంటలకు రాజగోపురం, 4వ సిద్ధలింగ మహాస్వాముల వారి శిలా మండపం ప్రారంభోత్సవం ఉంటాయి.
- 17న ఉదయం 10:51 గంటలకు ఉచిత సాముహిక వివాహాలు, సాయంత్రం 5 గంటలకు శ్రీ సిద్ధిలింగ స్వాముల మహారథోత్సవం, 7 గంటలకు ధర్మసభ, తులాభారం ఉంటాయి.



సిద్ధంగా ఉన్న రథోత్సవాలు

వారం ఉదయం 9 గంటలకు శ్రీ కుమారేశ్వర దాసోహభవనం శంకుస్థాపన

- 18న సిద్ధలింగమహా డోలాహరణ మహోత్సవం , పల్లకీసేవ, విద్యార్థి నిలయం ప్రారంభోత్సవం, 1111 మంది ముత్తైదువులకు ఒడినింపు కార్యక్రమం, సాయంత్రం శ్రీసిద్ధలింగేశ్వర విద్యాలయం ఇంగ్లిష్ మీడియం 7వ వార్షికోత్సవం ఉంటుంది. వీటితో పాటు వివిధ క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు మఠం నిర్వాహకులు పేర్కొన్నారు.

'రాయల సుభాష్‌చంద్రబోస్ ఆశయాలను కొనసాగిద్దాం'

అమరచింత: మిత, అతివాదులకు వ్యతిరేకంగా పోరాడిన రాయల సుభాష్ చంద్రబోస్ ఆశయాలను నేటి తరం యువకులు ముందుకు తీసుకెళ్లాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు రాజన్న, ప్రసాద్, హన్మంతు అన్నారు. రాయల సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని మార్క్స్ భవనంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఉమ్మడి రాష్ట్రంలో కేంద్ర కమిటీ నాయకుడిగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేశారన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల పక్షాన పోరాటాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సామేలు, ప్రేమరత్నం, భక్తి, కురుమన్న, జిలాని, మస్తామని, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.